



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4 PM

www.suryaa.com

బుధవారం

19-01-2026

పేజీలు: 02





'కొరియన్ కనకరాజు'గా రానున్న

## మెగా ప్రిన్స్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మెర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమాకు ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేశారు. 'VT15' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'కొరియన్ కనకరాజు' అనే పేరును ఖరారు చేస్తూ సోమవారం వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు. విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. కనకరాజు అనే వ్యక్తి కోసం కొరియా పోలీసులు ఓ భారతీయ ఫొటోగ్రాఫర్‌ను చిత్రహింసలు పెట్టడంతో వీడియో ప్రారంభమవుతుంది. ఇంతలో పౌర్ణమి రాత్రి కనకరాజు (వరుణ్ తేజ్) ఓ ఆత్మ ఆవహించిన వాడిలా పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించి, సమురాయ్ కత్తితో పోలీసులను అంతం చేస్తాడు. చివర్లో అతను కొరియన్ భాషలో 'నేను తిరిగొచ్చాను' అని చెప్పడం, "ఈ కనకరాజు మన కనకరాజు కాదు" అంటూ ఫొటోగ్రాఫర్ చెప్పే డైలాగ్ ఉత్కంఠను రేకెత్తిస్తోంది.

# దావోస్‌కు బయల్దేరిన చంద్రబాబు, రేవంత్ రెడ్డి

తమ రాష్ట్రాలకు పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు బయలుదేరారు. నిన్న అర్ధరాత్రి చంద్రబాబు దావోస్ కు బయల్దేరారు. కాసేపట్లో ఆయన జ్యూరిచ్ చేరుకోనున్నారు. ఆయనతో పాటు మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ దావోస్ సమ్మిట్ లో పాల్గొననున్నారు. దావోస్ లో ప్రపంచ ఆర్థిక వేదిక (WEF) సదస్సులో పాల్గొని రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే కీలక చర్చలు జరపనున్నారు. భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలపై చంద్రబాబు చర్చిస్తారు. స్విట్జర్లాండ్, యూఏఈ సహా పలు దేశాల ప్రతినిధులతో ఆయన సమావేశం కానున్నారు. తొలుత జ్యూరిచ్‌లో నిర్వహించే తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని తెలుగు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత రోడ్డు మార్గాన దావోస్‌కు వెళ్తారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో పాటు, వివిధ శాఖల ప్రతినిధులతో చంద్రబాబు సమావేశమై చర్చిస్తారు. టాటాసన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తోనూ సమావేశమవుతారు. మొత్తంగా దావోస్‌లో నాలుగు రోజుల పాటు పర్యటించనున్న చంద్రబాబు.. 36 కార్యక్రమాల్లో పాల్గొంటారు. మరోవైపు, ఈ ఉదయం మేడారం వనదేవతల దర్శనం పూర్తి చేసుకున్న రేవంత్ రెడ్డి... అక్కడి నుంచి నేరుగా హెలికాప్టర్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు బయల్దేరారు. ఐదు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో రేవంత్ రెడ్డి అంతర్జాతీయ స్థాయి సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను వివరించనున్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. తెలంగాణలో మౌలిక వసతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, వ్యాపారానికి అనుకూల వాతావరణాన్ని గ్లోబల్ ఇన్వెస్టర్లకు వివరించనున్నారు. ఈ పర్యటనలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు కూడా పాల్గొననున్నారు. మేడారం అమ్మవార్ల ఆశీస్సులతో ప్రారంభమైన ఈ విదేశీ పర్యటన తెలంగాణకు కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకువస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.



## ధనుష్ సినిమా విషయంలో కోర్టుకెక్కిన ఇరోస్

వివాదాలతో విడుదలవ్వలేక భారీ సినిమాలు సైతం ప్రసవవేదన పడుతున్న రోజులివి. ఈ విషయంలో 'అఖండ 2' ఎదుర్కొన్న అవాంతరాల గురించి తెలిసిందే. ఈ ఏడాది ప్రారంభంలో విడుదల కావాల్సిన తమిళ అగ్రహీరో విజయ 'జగనాయకుడు' కూడా సెన్సార్ సమస్యల వల్ల ఆగిపోయింది. కార్తీ తమిళ సినిమా 'వా వాతియర్' కూడా ఆర్థిక కారణాల వల్ల విడుదల కావాల్సిన తేదీలో విడుదల కాలేదు. ఆర్థిక సమస్యలన్నింటినీ దాటుకొని ఎట్టకేలకు ఈ నెల 14న తమిళనాట విడుదలై మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్నది. ఇవన్నీ రిలీజ్‌లకు చెందిన సమస్యలైతే.. విడుదలై.. థియేటర్లలో ఆడి, చివరకు ఓటీటీ దగ్గర సమస్యల్లో చిక్కుకున్నది ధనుష్ 'తేరే ఇష్క్ మే' చిత్రం. ఈ సినిమా తెలుగులో 'అమరకావ్యం' పేరుతో విడుదలై పెద్దగా మెప్పించలేకపోయింది. ఈ నెల 23న ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కావాల్సివుంది. ఈ క్రమంలోనే ఈ సినిమాకు చిక్కులు ఎదురయ్యాయి. గతంలో తాము నిర్మించిన 'రాంఝానా' చిత్రానికి కొనసాగింపుగా 'తేరే ఇష్క్ మే' చిత్రాన్ని నిర్మించారని, ఈ విషయంపై తమ అనుమతి తీసుకోలేదని ఇరోస్ ఇంటర్నేషనల్ సంస్థ ఆరోపిస్తూ.. ఈ విషయంపై ముంబాయి హైకోర్టును ఆశ్రయించింది. 'తేరే ఇష్క్ మే' చిత్రాన్ని నిర్మించిన 'కలర్ ఎల్లో' సంస్థ, చిత్ర దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించారని, ఈ కారణం వల్ల తమ ప్రతిష్టకు భంగం వాటిల్లినందుకుగాను రూ.84కోట్ల నష్టపరిహారం సదరు 'కలర్ ఎల్లో' సంస్థ నుంచి ఇప్పించాలంటూ ఇరోస్ సంస్థ పిటీషన్ దాఖలు చేసింది.



బాలీవుడ్‌లో మరో ఛాన్స్‌తో

## కీర్తి సురేశ్!

కీర్తి సురేష్ పేరు వినగానే దక్షిణాది ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చేది ఆమె నటన, ఎంపిక చేసుకునే కథలు. మలయాళీ అయినప్పటికీ, కథానాయికగా ఆమె సినీ ప్రయాణం మాత్రం తెలుగు చిత్రసీమలోనే ప్రారంభమైంది. రామ్ పోతినేని సరసన నటించిన 'నేను శైలజ'తో తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలకరించిన కీర్తి, ఆ సినిమాతోనే హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత 'మహానటి'లో సావిత్రి పాత్రతో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకోవడమే కాకుండా జాతీయ అవార్డును కూడా సొంతం చేసుకుంది.తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుసగా సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్ స్థాయికి ఎదిగిన కీర్తి, కొంతకాలం క్రితం బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. అయితే ఆమె హిందీ డెబ్యూ ఆశించిన స్థాయిలో ఫలితాన్ని ఇవ్వలేదు. విజయ్ హీరోగా నటించిన 'తేరి' సినిమాను హిందీలో 'బేబీ జాన్'గా రీమేక్ చేయగా, అందులో సమంత పాత్రను కీర్తి సురేష్ పోషించింది.



## బిగ్ బాస్ కన్నడ సీజన్ 12 విజేత గిల్లి



బిగ్ బాస్ కన్నడ సీజన్ 12 గ్రాండ్ ఫినాలే ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తూ ఘనంగా ముగిసింది. ఈ సీజన్‌లో 23 మంది పోటీదారులను వెనక్కి నెట్టి గిల్లి విజేతగా నిలిచి చారిత్రాత్మక విజయాన్ని సాధించాడు. షో హోస్ట్ సుదీప్ వేదికపై గిల్లి చేయి పైకెత్తి అతడిని సీజన్ 12 టైటిల్ విజేతగా అధికారికంగా ప్రకటించారు. 40 కోట్లకు పైగా ఓట్లు సాధించి గెలవడం ఈ సీజన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీజన్ ప్రారంభం నుంచే తన ఆటతీరు, వ్యూహం, అలాగే ప్రేక్షకులను ఆకట్టుకునే వ్యక్తిత్వంతో గిల్లి హౌస్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. అంతేకాదు, పలు రియాలిటీ షోల్లో పాల్గొని ప్రతిసారీ రన్నరప్‌గా నిలిచిన గిల్లి, ఈసారి మాత్రం విజేతగా నిలిచి తన కెరీర్‌లో కీలక మైలురాయిని చేరుకున్నాడు. గతంలో విజయానికి దగ్గరగా వచ్చి ఆగిపోయిన అతడు, బిగ్ బాస్ వేదికపై పూర్తి స్థాయి సక్సెస్‌ను అందుకున్నాడు. ఈ సీజన్‌లో రక్షిత కూడా ప్రేక్షకుల మనసులు గెలుచుకుంది. మొదటి రోజు నుంచి తన ఆటతో పాటు క్యూట్‌నెస్, నిజాయితీతో ఆకట్టుకున్న రక్షిత రన్నరప్‌గా నిలిచింది. గిల్లి—రక్షిత మధ్య జరిగిన పోటీ చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగి, ఫైనల్‌ను మరింత ఆసక్తికరంగా మార్చింది.



## దావోస్ 2026కి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉంది: మంత్రి లోకేశ్

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (దావోస్) 2026 సదస్సుకు ఆంధ్రప్రదేశ్ సర్వసన్నద్ధమైందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఏపీని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ గమ్యస్థానంగా నిలపడమే లక్ష్యమని, సీఎం చంద్రబాబు నాయుడు దార్శనికతను కొనియాడారు. దావోస్ వ్యాపార, సాంకేతిక పోకడలను అర్థం చేసుకునే గొప్ప వేదిక అని, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో దీర్ఘకాలిక సంబంధాలకు దోహదపడుతుందని వివరించారు. బ్రాండ్ ఏపీని అంతర్జాతీయ స్థాయిలో పునరుద్ధరించి, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించి, యువతకు ఉపాధి కల్పించడమే అంతిమ ధ్యేయమని లోకేశ్ స్పష్టం చేశారు.

## PM మోదీ-ట్రంప్: గాజా శాంతి ఒప్పంద బోర్డులో భారత్ కీలక పాత్ర

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు అత్యంత కీలక ఆహ్వానం పలికారు. యుద్ధంతో తీవ్రంగా ప్రభావితమైన గాజా ప్రాంతంలో శాంతిని స్థాపించేందుకు, అక్కడ పునర్నిర్మాణ పనులను పర్యవేక్షించే 'గాజా బోర్డ్ ఆఫ్ పీస్'లో భారత్‌ను సభ్య దేశంగా చేర్చాలని కోరారు.ట్రంప్ ఈ సందర్భంగా, ప్రపంచ దేశాల మధ్య సఖ్యత పెంపొందించడం, అంతర్జాతీయ వివాదాలను పరిష్కరించడం లో భారత్ పోషిస్తున్న నిర్మాణాత్మక పాత్రను ప్రశంసించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ 'విశ్వబంధు'గా ఎదిగిన దిశను కొనియాడారు. పశ్చిమ ఆసియాలో శాంతి స్థాపన, గాజా భవిష్యత్తు రూపకల్పనలో భారత్ భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ ఆహ్వానం కేవలం ఒక దౌత్య పిలుపు మాత్రమే కాక, ప్రపంచ శాంతి స్థాపనలో భారత్ చేపట్టబోయే కీలక బాధ్యతకు సాక్ష్యంగా నిలుస్తోంది. గాజాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను పరిష్కరించడానికి, పాలన మరియు దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునర్నిర్మించడానికి ఈ ప్రత్యేక బోర్డు పనిచేయనుంది.ఇజ్రాయెల్, పాలస్తీనా రెండింటితో భారత్ మంచి సంబంధాలతో కలిసిన దేశంగా ఉండటం విశేషం. ఇజ్రాయెల్ ప్రధానితోనూ, అరబ్ దేశాల నాయకులతోనూ ప్రధాని మోదీ ఉన్న సాన్నిహిత్యం వల్ల, భారత్ ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన మధ్యవర్తిగా నిలవగలదని అమెరికా భావిస్తోంది. దీంతో, భారత్ ఈ బోర్డులో ఉంటే చర్చలు ఫలప్రదంగా సాగతాయని, పశ్చిమ ఆసియాలో శాశ్వత శాంతికి దారి సుగమమవుతుందని అంచనా వేస్తున్నారు.గత కొన్ని సంవత్సరాలుగా పశ్చిమ ఆసియాలోని సంక్షోభంపై భారత్ సమతుల్య విధానాన్ని అనుసరిస్తోంది. అక్టోబర్ 7న జరిగిన దాడుల తర్వాత ఉగ్రవాదాన్ని తీవ్రంగా



ఖండిస్తూ, గాజాలోని సాధారణ ప్రజలకు మానవతా సహాయం అందించడంలో ముందుంది. "చర్చలు, దౌత్య మార్గాలే సమస్యలకు పరిష్కారం" అని భారత్ ఐక్యరాజ్యసమితి వేదికపై పలుమార్లు స్పష్టం చేసింది. ఈ తటస్థ విధానం ఇప్పుడు భారత్‌కు అరుదైన గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఎలాంటి సైనిక జోక్యం లేకుండా, కేవలం శాంతియుత మార్గాల్లో పరిష్కారం చూపగల దేశంగా భారత్ దృష్టిలో ఉంది.భారత్ ఈ ప్రతిపాదనను అంగీకరిస్తే, అంతర్జాతీయ రాజకీయాల్లో ఇది చారిత్రక మలుపుగా మారుతుంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం ప్రయత్నిస్తున్న భారత్‌కు ఇది గొప్ప అవకాశంగా మారుతుంది. పొరుగు దేశాల సమస్యలు మాత్రమే కాక, ఖండాంతర సంక్షోభాలను పరిష్కరించగల గ్లోబల్ లీడర్‌గా భారత్ ఎదుగుతుందని ఇది స్పష్టంగా చూపుతుంది.

## భార్య గొంతుకోసిన భర్త.. అడ్డొచ్చిన కుమార్తెపైనా దాడి!

సిద్దిపేట జిల్లాలో దారుణం జరిగింది. కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి తన భార్య గొంతు కోశాడు. అడ్డొచ్చిన కుమార్తెపైనా రోకలి బండతో దాడి చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణంలోని ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్న ఎల్లయ్యకు అతని భార్య శ్రీలత (40)కి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ కుటుంబ కలహాల కారణంగా ఆగ్రహానికి గురైన ఎల్లయ్య శ్రీలత గొంతు కోశాడు. అడ్డొచ్చిన కుమార్తె అర్చనపైనా రోకలి బండతో దాడి చేశాడు. క్షణికావేశంతో భార్యను హత్య చేసినప్పటికీ.. ఆ తర్వాత భయపడిపోయిన ఎల్లయ్య తాను కూడా గొంతు కోసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. గాయాలతో ఉన్న ఎలయ్య, అర్చనను ఆస్పత్రికి తరలించారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# తమిళ్ బిగ్ బాస్ సీజన్ 9కి లేడీ విన్నర్

వైల్డ్ కార్డ్‌గా ఎంట్రీ ఇచ్చి టైటిల్ కొట్టేసిన దివ్య గణేష్ బిగ్ బాస్ రియాల్టీ షోకు అన్ని భాషలలోనూ విపరీతమైన ఆదరణ లభిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే తెలుగు బిగ్ బాస్ సీజన్ 9 కూడా విజయవంతంగా ముగియగా, చివరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ షోలో కామనర్ కళ్యాణ్ పడాల విజేతగా నిలిచాడు. అయితే ఇప్పటి వరకు తెలుగులో బిగ్ బాస్ మెయిన్ షోలో లేడీ విన్నర్ లేకపోవడం గమనార్హం. కేవలం బిగ్ బాస్ ఓటీటీ వర్షన్‌లో మాత్రమే హీరోయిన్ బింధు మాధవి టైటిల్ గెలుచుకుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు తమిళ్ బిగ్ బాస్ సీజన్ 9లో లేడీ కంటెస్టెంట్ విజేతగా నిలవడం ప్రత్యేక చర్చకు దారి తీసింది. హీరో విజయ్ సేతుపతి హోస్ట్‌గా వ్యవహరించిన తమిళ్ బిగ్ బాస్ సీజన్ 9 అక్టోబర్ 5, 2025న ప్రారంభమై, జనవరి 18, 2026న గ్రాండ్‌గా ముగిసింది. ఈ సీజన్ మొత్తం 20 మంది పోటీదారులతో ప్రారంభమైంది. మూడో వారం నాటికి దివ్య గణేష్, అమీత్, సాండ్రా, ఆమె భర్త ప్రజిన్‌లతో కలిసి నలుగురు వైల్డ్ కార్డ్ ఎంట్రీలుగా హౌస్‌లోకి అడుగుపెట్టారు. అప్పటి నుంచి ఆట మరింత ఆసక్తికరంగా మారింది. విజేతగా నిలిచిన దివ్య గణేష్‌కు బిగ్ బాస్ తమిళ సీజన్ 9 టైటిల్‌తో పాటు రూ.50 లక్షల నగదు బహుమతి అందజేశారు. వైల్డ్ కార్డ్‌గా వచ్చి లేడీ విన్నర్‌గా నిలిచిన ఆమె ప్రయాణం ఇప్పుడు తమిళ్ బిగ్ బాస్ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయింది. ఈ విజయం దివ్య కెరీర్‌కు కొత్త ఊపునిస్తుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# మరోసారి దర్యాప్తు సంస్థ ఎదుట విజయ్ హాజరు

తమిళనాడులో గత ఏడాది చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు మరింత వేగం పుంజుకుంది. ఈ విషాద ఘటనకు సంబంధించి టీవీకే (తమిళగ వెట్రి కజగం) చీఫ్ విజయ్ సోమవారం మరోసారి సీబీఐ ఎదుట హాజరయ్యారు. 41 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన నేపథ్యంలో, బాధ్యతలు, నిర్వహణ లోపాలు, భద్రతా వైఫల్యాలపై సీబీఐ లోతైన విచారణ చేపట్టింది. గత ఏడాది సెప్టెంబర్ 27న తమిళనాడులోని కరూర్ జిల్లాలో జరిగిన రాజకీయ ప్రచార సభలో విజయ్ ప్రసంగించేందుకు వచ్చిన సమయంలో భారీగా ప్రజలు తరలివచ్చారు. ఒక్కసారిగా జనసమూహం అదుపు తప్పడంతో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జనసమూహ నిర్వహణ, పోలీసు మరియు పరిపాలనా సంసిద్ధతపై తీవ్ర ప్రశ్నలను లేవనెత్తింది. ఈ కేసు దర్యాప్తును రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలోని పర్యవేక్షక కమిటీ పర్యవేక్షిస్తోంది. కమిటీ సూచనల మేరకు సీబీఐ బాధ్యతల నిర్ణయం, ప్రణాళికా వైఫల్యాలు, ఘోర విషాదానికి దారితీసిన సంఘటనల



క్రమంపై దృష్టి సారిస్తూ విచారణను ముమ్మరం చేసింది.దర్యాప్తులో భాగంగా ఇప్పటికే టీవీకే పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు, కార్యకర్తలను సీబీఐ విచారించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, ఎన్నికల నిర్వహణ విభాగం ప్రధాన కార్యదర్శి ఆధవ్ అర్జున్, జాయింట్ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్, కరూర్ జిల్లా కార్యదర్శి మథియజగన్ సహా కీలక నేతల వాంగ్మూలాలను నమోదు చేసింది. సభ నిర్వహణ ఎవరి ఆధ్వర్యంలో జరిగింది, ముందస్తు ప్రణాళికలు ఎలా చేపట్టారు, భద్రతా చర్యలు తగిన స్థాయిలో ఉన్నాయా లేదా అనే అంశాలపై సీబీఐ వివరంగా ప్రశ్నించింది. ఈ విచారణల అనంతరం, ఈ కేసుకు సంబంధించి విజయ్ పాత్రపై స్పష్టత కోసం సీబీఐ ఆయనను ఢిల్లీకి రావాలని సమన్లు జారీ చేసింది. ఆ మేరకు ఈ నెల 12న ఉదయం 11 గంటలకు విజయ్ సీబీఐ కార్యాలయంలో హాజరయ్యారు. దాదాపు ఏడు గంటల పాటు ఆయనను ప్రశ్నించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కరూర్ తొక్కిసలాట ఘటనలో నిజాలు బయటకు రావాలన్న డిమాండ్‌తో బాధిత కుటుంబాలు న్యాయం కోసం ఎదురుచూస్తున్న వేళ, సీబీఐ దర్యాప్తు కీలక మలుపు తిరిగే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కేసులో తదుపరి చర్యలు, బాధ్యులపై తీసుకునే నిర్ణయాలు రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తిగా మారాయి.



సాధారణంగా హీరోలు, హీరోయిన్లు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారు. ఇక వారు ధరించే దుస్తులు, వారు నడిపే కార్లు, వారు కలిగి ఉన్న బంగ్లాలు అన్నీ చాలా ఖరీదైనవి. సెలబ్రిటీలు ఉపయోగించే ఒకే ఒక్క వాచ్ ధరతో సామాన్యుడు ధనిక జీవితాన్ని గడపవచ్చు. అయితే, కొంతమంది ధనిక జీవితాన్ని ఆస్వాదిస్తారు. అలాగే కొందరు తమ సింపుల్ లైఫ్ స్టైల్ తో అందరి దృష్టిని ఆకర్షిస్తుంటారు. ఇప్పుడు ఒక నటి అందరి హృదయాలను గెలుచుకుంది. కోట్ల ఆస్తులు.. లంబోర్గిని కారు ఉన్నప్పటికీ ఆమె ఇప్పుడు చిన్న స్విఫ్ట్ కారులో తిరగడం చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఆమె మరెవరో కాదు.. శ్రద్ధా కపూర్. ఇటీవల కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్ చిన్న కారు వాడుతున్నాడని వార్తలు వచ్చాయి. వెయ్యి కోట్లు వసూలు చేసిన చిత్రానికి దర్శకుడు అయినప్పటికీ చిన్న కారులో తిరగడం చూసి షాకయ్యారు.

## రూ.900 కోట్ల హీరోయిన్..


# శ్రద్ధా కపూర్

# స్టార్ హీరో అసభ్య ప్రవర్తనపై పూజ హెగ్డే సంచలన వ్యాఖ్యలు

టాలీవుడ్‌తో పాటు సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పూజ హెగ్డే తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించడంతో, ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇంటర్వ్యూలో పూజ హెగ్డే మాట్లాడుతూ, తన కెరీర్ బిగినింగ్‌లోనే ఓ భారీ పాన్ ఇండియా సినిమాలో అవకాశం వచ్చిందని తెలిపింది. ఆ ప్రాజెక్ట్ పాన్ ఇండియా స్టార్ హీరోతో ఉండటంతో చాలా ఆనందంగా ఒప్పుకున్నానని చెప్పింది. అయితే షూటింగ్ సమయంలో జరిగిన ఒక సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పూజ వెల్లడించింది. "ఆ సినిమా షూటింగ్ సమయంలో నా అనుమతి లేకుండానే ఆ హీరో నా క్యారవాన్‌లోకి వచ్చాడు. అప్పటికే అది నాకు చాలా అసౌకర్యంగా అనిపించింది. ఆ తర్వాత అతడు నాతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ క్షణంలో నాకు ఏమి చేయాలో కూడా అర్థం కాలేదు. చాలా షాక్‌కు గురయ్యాను" అని పూజ చెప్పింది. ఆ పరిస్థితిని తట్టుకోలేకపోయిన తాను సహనం కోల్పోయానని, వెంటనే అతడిని లాగిపెట్టి కొట్టానని పూజ సంచలన వ్యాఖ్యలు చేసింది. "అలా చేయగానే అతడు వెంటనే క్యారవాన్ నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత అతడితో కలిసి నటించాలనే ఆసక్తి నాకు పూర్తిగా పోయింది. అందుకే నా సీన్స్‌ను డూప్‌తో షూట్ చేశారు" అని ఆమె వివరించింది.



# మేడారం జాతరకు ఏఐ సొబగులు.. డ్రోన్లు, జియో ట్యాగ్‌లతో హైటెక్ నిఘా



దక్షిణ భారత కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ఈసారి ఆధునిక సాంకేతిక హంగులతో జరగనుంది. ఈ నెల 28 నుంచి 31 వరకు జరిగే ఈ చారిత్రక ఘట్టానికి తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ మునుపెన్నడూ లేనివిధంగా కృత్రిమ మేధ (AI) ఆధారిత భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాయి. జాతర ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా భద్రతా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. జాతర భద్రత కోసం 'మేడారం 2.0' పేరుతో అత్యాధునిక సాంకేతికతను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా 'టీజీ-క్వెస్ట్' అనే ఏఐ డ్రోన్ వ్యవస్థను వినియోగిస్తున్నారు. ఇవి దాదాపు 30 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం, జంపన్నవాగు, రద్దీ మార్గాలపై గగనతలం నుంచి నిరంతరం నిఘా ఉంచుతాయి. వీటితో పాటు ఆకాశంలో ఎగిరే హీలియం బెలూన్లకు పాన్-టిల్ట్-జూమ్ కెమెరాలను అమర్చారు. ఇవి అత్యంత ఎత్తు నుంచి జనసమూహాన్ని విశ్లేషించి, తొక్కిసలాట జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం చేస్తాయి. ఈ హైటెక్ నిఘా నీడలో సుమారు 13 వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. గత జాతరలో వేలాది మంది తప్పిపోయిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి వొడాఫోన్-ఐడియా సహకారంతో 'జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్' విధానాన్ని అమలు చేస్తున్నారు. పస్రా, తాడ్వాయి మార్గాల్లోని కౌంటర్ల వద్ద వృద్ధులు, పిల్లల వివరాలు నమోదు చేసి, వారికి క్యూఆర్ కోడ్ ఉండే జియోట్యాగ్‌ను చేతికి కడతారు. ఒకవేళ వారు తప్పిపోతే, ఈ ట్యాగ్‌ను స్కాన్ చేయడం ద్వారా వారి వివరాలు సులభంగా తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించవచ్చు. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని ఇప్పుడు మేడారంలోనూ అమలు చేస్తున్నారు. జాతరలో నేరగాళ్లను గుర్తించేందుకు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని కూడా వాడుతున్నారు. ఆసుపత్రి, పార్కింగ్ స్థలాల వంటి కీలక ప్రదేశాల్లో పాత నేరస్థుల కదలికలను ఈ సాంకేతికత ద్వారా పసిగడతారు. అనుమానాస్పద వస్తువులను గుర్తించేందుకు రియల్-టైమ్ అలర్ట్ సిస్టమ్ సైతం పనిచేస్తుంది. భక్తుల సౌకర్యం కోసం 2,000 ఎకరాల్లో 37 పార్కింగ్ ప్రదేశాలు, 50కి పైగా అనౌన్స్‌మెంట్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

# ట్రంప్ వ్యాఖ్యల ఎఫెక్ట్.. రికార్డు స్థాయికి చేరిన పసిడి, వెండి

సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండి ధరలు ఈరోజు చరిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరాయి. గ్రీన్‌లాండ్ వివాదం నేపథ్యంలో పలు యూరోపియన్ దేశాలపై కొత్తగా సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడంతో ఇన్వెస్టర్లు బంగారం వైపు పరుగులు పెట్టారు. దీంతో అంతర్జాతీయంగా, దేశీయంగా పసిడి, వెండి ధరలు కొత్త రికార్డులు సృష్టించాయి. దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో ఫిబ్రవరి ఫ్యూచర్స్ బంగారం ధర 1.68 శాతం పెరిగి 10 గ్రాములకు రూ. 1,44,905 పలికింది. అలాగే మార్చి ఫ్యూచర్స్ వెండి ధర ఏకంగా 4.39 శాతం వృద్ధితో కేజీకి రూ. 3,00,400 వద్ద ఆల్ టైమ్ హై రికార్డును నమోదు చేసింది. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో కూడా ఔన్స్ బంగారం ధర 1.6 శాతానికి పైగా పెరిగి 4,700 డాలర్ల స్థాయిని తాకింది. గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసేందుకు



అమెరికాను అనుమతించే వరకు యూరప్‌లోని ఎనిమిది దేశాల నుంచి దిగుమతులపై సుంకాలు పెంచుతామని ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామంతో ఇన్వెస్టర్లలో ఆందోళన పెరిగి, వారు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం, వెండి వైపు మళ్లించారు.



# చంద్రబాబు కోసం బండ్ల గణేశ్ పాదయాత్ర... నటుడు శివాజీ స్పందన

సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ తిరుమలకు పాదయాత్రను ప్రారంభించారు. వైసీపీ హయాంలో చంద్రబాబును అరెస్ట్ చేసిన సమయంలో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి మొక్కుకున్నానని, ఆ మొక్కును తీర్చుకునేందుకు సంకల్పయాత్ర పేరుతో తిరుమలకు పాదయాత్రగా వెళుతున్నానని చెప్పారు. మరోవైపు, బండ్లగణేశ్ పాదయాత్ర ప్రారంభ కార్యాక్రమానికి నటుడు శివాజీ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... సామాన్యుడిగా వచ్చిన బండ్ల గణేశ్ ఒక బ్రాండ్ గా ఎదిగారని కొనియాడారు. చంద్రబాబు క్షేమంగా బయటకు రావాలని బండ్ల గణేశ్ మొక్కుకున్నారని... ఇప్పుడు మొక్కులు చెల్లించుకుంటున్నారని తెలిపారు. బండ్ల గణేశ్ తో తనకు 32 ఏళ్ల స్నేహబంధం ఉందని చెప్పారు. తనను నమ్మిన వారిని గణేశ్ ఎప్పుడూ వదులుకోరని తెలిపారు.